క్లుప్తంగా

ముస్లింలకు మైక్‌సెట్ బహూకరణ



పరకాల : రంజాన్ సందర్భంగా పట్టణంలోని ఈద్గాకు మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ అలీ ఆధ్వర్యంలో ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామిరెడ్డి రూ.25 వేల విలువైన మైక్‌సెట్ బహూకరించారు. తొలుత ఆయన ముస్లింలతో కలిసి ప్రార్థనలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇనుగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ముస్లిం సోదరులకు అండగా ఉంటామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈద్గాల అభివృద్ధికి, ముస్లింల సంక్షేమానికి, కబరస్తాన్‌ల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు రంజాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



ఎల్కతుర్తి : మండలంలోని జీల్గుల గ్రామానికి చెందిన కస్తూరి తిరుపతి ఆర్నెళ్ల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై జక్కుల పరమేష్ శనివారం అప్పగించారు. వివరాలిలా.. తిరుపతి ఆర్నెళ్ల క్రితం వన్‌ప్లస్ ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసులు తాజాగా అందుబాటులోకి వచ్చిన టియర్ టెక్నాలజీని వినియోగించి తిరుపతి ఫోన్ హుజురాబాద్‌కు చెందిన జన్ను అశోక్ వద్ద ఉన్నట్టు గుర్తించారు. అనంతరం అశోక్ నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని తిరుపతికి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పరమేష్ అప్పగించారు.

'భట్టి' పాదయాత్రను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'హాథ్ సే హాథ్ జోడో యాత్ర'లో భాగంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తలపెట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రను విజయవంతం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి నాయకులను, మండల ప్రజలను శనివారం ఒక ప్రకటనలో కోరారు. పాదయాత్ర ఈనెల 24న మండలంలోని గుంటూర్‌పల్లి వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమై ఆరెపల్లి, బాహుపేట వరకు కొనసాగనుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

నేడు భీమ్‌దీక్ష ముగింపు సభ

● స్వేరో రాష్ట్ర కోకన్వీనర్ సదానందం



ఎల్కతుర్తి : ఈనెల 23న సంగారెడ్డిలోని పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో భీమ్‌దీక్షా ముగింపు సభ నిర్వహించనున్నట్టు స్వేరోస్ రాష్ట్ర కోకన్వీనర్ చాతళ్ల సదానందం తెలిపారు. ఆ కార్యక్రమ వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జ్ఞానం కోసం చేసే దీక్షా సభలో కళాకారులు, రజయితలు, విద్యావంతులు, మేదావులు, అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసంఘల నాయకులు, స్వేరోస్ నాయకులు, బహుజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీపీఎల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గడప రాజు, నాయకులు అంబాల మహేష్, పంగ రవి, నమిండ్ల ప్రభుదాస్, ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

25న రేషన్ డీలర్ల గౌరవ వేతన సాధన సభ

నడికూడ : ఈనెల 25న హనుమకొండలో రేషన్ డీలర్ల గౌరవ వేతన సాధన సభ నిర్వహించనున్నట్టు రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గడ్డం సర్వేషం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని డీలర్లందరూ కుటుంబాలతో సహా సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కమిషన్‌ను కూడా అందించకుండా రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్ల పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలి పారు. ప్రభుత్వ తప్పుడు విధానాలకు వ్యతి రేకంగా పోరాడాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వడంతోపాటు ఇతర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



శాయంపేట : ప్రార్థన చేస్తున్న ముస్లింలు



పరకాలలో..



పరకాల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

మతసామరస్యం వెల్లివిరియాలి

హనుమకొండ జిల్లాలోని పలు మండలాల్లో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో ఊరూరా రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఐనవోలులో..



ఎల్కతుర్తిలో..

● రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే ధర్మారెడ్డి

పరకాల : సమాజంలో మతసామరస్యం వెల్లివిరియాలని స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని ఈద్గాలో ముస్లింలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని మతాలకు సమాన గౌరవం కల్పిస్తున్నట్టు తెలిపారు. ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి పాల్గొన్నారు.

ఐనవోలు : ముస్లింలు మండలంలోని మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. రంజాన్ ఉపవాస దీక్షలు విరమించి సేమియా, స్వీట్లు పంచుకుని ఆనందంగా గడిపారు. వెంకటాపూర్‌లో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం జమాత్ అధ్యక్షుడు మహబూబ్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌ను పేదల పండుగగా అభివర్ణించారు. దాన ధర్మాల పండుగగా కొనియాడారు. వేడుకల్లో జెడ్పీ, మండల కోఆప్షన్ సభ్యులు ఉస్మాన్ అలీ, గుంశావలీ, అబ్బాస్ అలీ, హాజీమియా, అహ్మద్, అక్బర్, రఫీ, అన్వర్, పాషా, నజీరుద్దీన్, అజీముద్దీన్, అఫ్రిద్, యాకూబ్, రంజాన్, రజాక్, ఇమామ్, సమద్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లోని ఈద్గాల్లో, మసీదుల్లో ముస్లిం పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముల్కనూర్ ఎస్సై మహేందర్, యాకూబ్ పాషా, మహ్మద్ రఫీ, బడేషా, అమీరొద్దీన్, వలీపాషా, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని ఆత్మకూరు, కటాక్షపూర్, చౌళ్లపెల్లి, గూడెప్పాడ్, పెంచికలపేట గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. హౌజ్‌బుజుర్గులో మస్జిద్ ఆబిదా యూసఫ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఇమామ్, సయ్యద్ వలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు జుబేదా లాల్ మహ్మద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.

దామెర : మండలంలో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఊరుగొండలో వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, కొగిల్వాయిలో మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలోని ఈద్గా మైదానంలో మత గురువు అబ్దుల్లా నేతృత్వంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అంకుషావలీ, రాజీమహ్మద్, జానీసైదా, సర్వర్, రఫీ, సర్దార్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని కమలాపూర్, ఉప్పల్, శనిగరం, అంబాల, శ్రీరాముపల్లి, పంగిడిపల్లి, శంభునిపల్లి, దేశరాజుపల్లి, భీంపల్లి, గుండేడు, నేరెళ్ల, మర్రిపల్లిగూడెం తదితర అన్ని గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఆయా గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల్లో ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక నమాజ్ చేశారు.



వేలేరులో..



ధర్మసాగర్‌లో చీరలు పంపిణీ చేస్తున్న జుబేదా



దామెరలో..

'సఖి' సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న సర్పంచ్ వసంత

ఎల్కతుర్తి : కష్టాల్లో ఉన్న మహిళలు 'సఖి' సెంటర్ సేవలను వినియోగించుకోవాలని వీరనారాయణపూర్ సర్పంచ్ చదిరం వసంత కోరారు. మండలంలోని ఆ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమస్యల్లో ఉన్న మహిళల, బాలలకు అండగా నిలిచేందుకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. గృహహింస, వేధింపులు, తదితర ఎలాంటి సమస్యలున్నా బాధిత మహిళలు సఖి కేంద్రాన్ని ఆశ్రయించవచ్చని చెప్పారు. కేస్ వర్కర్ హరిత మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు కౌన్సెలింగ్, వైద్య, పోలీసు, న్యాయ సాయం అందించడంతోపాటు తాత్కాలిక వసతి సైతం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ ఐదు రకాల సేవలతో బాధిత మహిళలకు స్వాంతన కల్పిస్తున్నట్టు చెప్పారు. చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గృహహింస, లైగింక వేదింపులు, అత్యాచారాల, తదితర సమస్యల నుంచి రక్షణ పొందడానికి సఖి తోడ్పాటు అందిస్తుందని చెప్పారు. సఖి సెంటర్ 24 గంటలు పని చేస్తుందని వివరించారు. సమస్యల్లో ఉన్న మహిళలు, బాలికలు 181కు లేదా 0870-2452112 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పంట సాగులో భూసార పరీక్షలు కీలకం



భూసార పరీక్ష కోసం మట్టి సేకరిస్తున్న కల్పన



సూరంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు

శాయంపేట : సాగు చేయాల్సిన పంటను గుర్తించడంలో భూసార పరీక్షలు కీలకమని మారి స్వచ్ఛంద సంస్థ ఫీల్డ్ ఫెసిలిటేటర్ కల్పన తెలిపారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో శనివారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతులు పంట పొలాల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్షలు చేయించి ఫలితాల ఆధారంగా పంటను ఎంపిక చేసుకుని సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించగలరని తెలిపారు. భూసార పరీక్షలకు ఏప్రిల్, మే నెలలు అనుకూలమని చెప్పారు. రైతులందరూ తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

సూరంపేటలో..

53వ ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని మారి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సూరంపేట గ్రామంలో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఫీల్డ్ ఫెసిలిటేటర్ కల్పన మాట్లాడారు. ప్రకృతి వనరులను బాధ్యత కాపాడుకోవాలని సూచించారు. రైతులు పొలం గట్ల మీద, అడవిలోని మొక్కలను నరకొద్దని కోరారు. అనంతరం ధరిత్రిని కాపాడతామంటూ రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడప రవీందర్, సత్యం, సాంబయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈదురు గాలులతో అకాల వర్షం

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన అకాల భారీ వర్షం కురిసింది. పలుచోట్ల అరబోసిన వరిధాన్యం తడిచింది. ఒక్కసారిగా ఈదురు గాలులతో వర్షం కురవడంతో రైతులు కల్లాల వద్దకు పరుగులు తీశారు. రైతుల చేరుకునే సరికే కొన్ని చోట్ల ధాన్యం తడిచింది. ఎల్కతుర్తిలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభికపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు.

కమలాపూర్ : మండలవ్యాప్తంగా శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిల్వ చేసిన వరి ధాన్యం తడిచింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

బాల్యమిత్రుడి కుటుంబానికి చేయూత



కృష్ణమూర్తి కుటుంబానికి సాయం అందిస్తున్న అతడి మిత్ర బృందం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక, జెడ్పీ సెకండరీ స్కూల్‌లో 1990-91లో టెన్త్ చదువుకున్న మిత్రులు తమ బాల్యమిత్రుడి కుటుంబానికి రూ.50 వేలు చేయూత అందించి అండగా నిలిచారు. వివరాలిలా... మండల కేంద్రానికి చెందిన పార్శ కృష్ణమూర్తి ఈనెల 14న మృతి చెందాడు. ఈ క్రమంలో అతడితో కలిసి సరస్వతి శిశు మందిర్‌లో ప్రాథమిక, జెడ్పీ సెకండరీ స్కూల్‌లో టెన్త్ చదువుకున్న మిత్రులందరూ కలిసి అతడి కుటుంబానికి శనివారం రూ.50 వేలు సాయం అందించారు. కృష్ణమూర్తి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి బాల్య స్నేహితులు మునుకుంట్ల సతీష్, రేవూరి సుధాకర్‌రెడ్డి, పాపని రవీందర్, పరికిరాల వాసు, మూల ప్రవీణ్, కాసర్ల రాజు, బయ్యా శ్రీధర్, నాగపురి మహేష్, లక్కర్సు ఈశ్వర్, రాసమల్ల పరమేశ్వర్, బట్టు రవి, ఆగన్న, మురళీధర్‌రెడ్డి, సుగ్రీవుడు పాల్గొన్నారు.

రేపటి నుంచి జేవీవీ ఆధ్వర్యంలో వేసవి శిబిరం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో ఈనెల 24 నుంచి మూడ్రోజులపాటు 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరం నిర్వహిస్తామని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర పర్యావరణ విభాగం కన్వీనర్ కేబీ.ధర్మప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం పెంపొందించే దిశలో శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, యాజమాన్యాల పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. గణితంలో గమ్మత్తులు, ఓరిగామి, డ్రాయింగ్ అంశాలపై చర్చలు, మానసికోలాస క్రీడలు, దేవాదుల ఎత్తిపోతల ధర్మసాగర్ పెద్ద చెరువు (రిజర్వాయర్) సందర్శన, సైన్స్ ప్రయోగాలు, తదితర సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. శిబిరం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9989732423లో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా 24న ఉదయం 8 గంటలకు శిబిరానికి హాజరు కావచ్చని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

దామెర : రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై ముత్యం రాజేందర్ స్పష్టం చేశారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని సైలానీ బాబా దర్గా వద్ద జాతీయ రహదారిపై పోలీసులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన పలువురు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ద్విచక్ర వాహనదార్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్ చేస్తే జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. జాతీయ రహదారి నిర్మాణంలో ఉన్న క్రమంలో వాహనదారులు నిదానంగా ప్రయాణం సాగించాలని సూచించారు. తనిఖీలో ఏఎస్సై సిద్దులు, హెడ్ కానిస్టేబుల్ యాకయ్య, సిబ్బంది రమేష్, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరశురాముడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



పరశురాముడి చిత్రపటానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఉపేంద్రశర్మ, సేవా సమితి సభ్యులు

హన్మకొండ కల్చరల్: పరశురాముడిని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో జరుగుతున్న అన్యాయాలను సంఘటితంగా ఎదుర్కోవాలని బ్రాహ్మణసేవా సమితి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ సూచించారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణభవన్‌లో పరశురామ జయంతిని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని పరశురాముడి చిత్రపటానికి పూలమాలలు వేసి పురుషసూక్త విధానంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉపేంద్రశర్మ మాట్లాడుతూ పరశురామ జయంతిని బ్రాహ్మణులకు దళితులకు మధ్య సాంస్కృతిక వారధిగా జరుపుకోవాలని అన్నారు. పరశురామ దళం ఏర్పాటు చేశారు. దళం వరంగల్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో బ్రాహ్మణ యువకులు పాల్గొని సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

నేటి నుంచి కల్యాణ బ్రహ్మోత్సవాలు

● శ్రీవేంకటేశ్వర శివ మార్కండేయ ఆలయాల్లో ఏర్పాట్లు



శాయంపేటలోని శ్రీ వెంకటేశ్వర, శివ మార్కండేయ స్వామి వార్ల ఆలయం

శాయంపేట : మండల కేంద్రంలో బాసాని కైలాసం కుటుంబీకులు నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ గణపతి, శ్రీ పర్వత వర్ధని సమేత శ్రీశివ మార్కండేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి, ఆదిత్యాది నవగ్రహ ఆలయాల సముదాయం అత్యంత సుందరంగా ఆహ్లాదకర వాతావరణంలో ఉంది. ఆలయం సమీపంలోనే దేవుని చెరువు ఉండడంతో శోభాయమానంగా దర్శనమిస్తోంది. 2013లో వరంగల్ పట్టణంలోని భద్రకాళీ దేవస్థాన ప్రధాన అర్చకుడు శేషు నేతృత్వంలో ఆయన శిష్యులు విగ్రహ ప్రతిష్టా మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. అప్పటి నుంచి శాస్త్రీయంగా ప్రతిష్టా సంస్కారం త్రాహిణిక దీక్షతో మహావైభవంగా జరపబడి ఆలయంలో నిత్య పూజాధికాలు దినదిన ప్రవర్తమానంగా కొనసాగుతున్నాయి. స్వామివార్లు భక్తుల పట్ల కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. ఆలయం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖ క్షేత్రాల్లో ఒకటిగా పూజలందుకుంటోంది. శాయంపేట గ్రామంలో శివకేశవుల ప్రతిష్ట జరిగిన ఏడాదిలోపే తెలంగాణ ఏర్పడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరడం జిల్లాలోని శాయంపేట వైశిష్ట్యాన్ని చాటుతోంది. ఆగమశాస్త్ర పద్ధతిని అనుసరించి కర్షనాది ప్రతిష్టాంతం ప్రతిస్తాది ఉత్సవంతం అను ప్రమాణం మేరకు ప్రతిష్ట నిర్వహించి పదేళ్లు కావస్తున్న సందర్భంలో శ్రీ శోభాకృత్ నామ సంవత్సర వైశాఖ శుద్ధ తదియను పురస్కరించుకొని ఈనెల 23 నుంచి 26 షష్టి వరకు దశమ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ఈనెల 23 నుంచి 26 వరకు దశమ వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ తెలిపారు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, వేసవిలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి కల్పించినట్టు చెప్పారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

శాయంపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి, శివ మార్కండేయ స్వామి ఆలయ సముదాయాల్లో నేడు (ఆదివారం) అంకురార్పణ, 24న గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, అగ్నిస్థాపన, బేరితాడనం, ధ్వజారోహణం, మండల దేవతాపూజానం, ఎదురుకోలు, 25న మూల విరాట్టులకు అభిషేకం, శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం, శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్ తెలిపారు. అనంతరం మహా అన్నదానం, 26న షష్టి సుదర్శన హోమం, చండీ హోమం, పూర్ణాహుతి, ధ్వజారోహణ కార్యక్రమాలతో ఉత్సవ పరిసమాప్తి జరుగుతుందని ఆయన వివరించారు. వేడుకలకు మండలంలోని ప్రజలందరూ పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని చైర్మన్ ఆకాంక్షించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ఐనవోలు : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకన్నారు. ఎస్సై గుగులోతు వెంకన్న కథనం ప్రకారం.. మండలంలోని నందనం ఆకేరు వాగు పరిసర ప్రాంతాల నుంచి ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న సమాచారం అందడంతో పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకతో వెళ్తున్న 3 ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ, సంబంధిత శాఖల అధికారుల నుంచి సరైన అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను. మట్టిని అక్రమంగా తరలించొద్దని స్పష్టం చేశారు.

పద్మశాలి సంఘం కమిటీ ఎన్నిక

● అధ్యక్షుడిగా బొప్ప శివశంకర్



పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

కమలాపూర్ : పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా కమలాపూర్‌కు చెందిన బొప్ప శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి తాటం రవీందర్, పట్టణ అధ్యక్షుడు బైరి దశరథం, మాజీ ఎంపీటీసీ మార్గం భిక్షపతి, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు పొరండ్ల ఆనందం ఆధ్వర్యంలో శనివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుమ్మ శోభన్‌బాబు, ఉపాధ్యక్షులుగా పొరండ్ల కృష్ణప్రసాద్, ఆడెపు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పొరండ్ల రమేష్, కార్యదర్శిగా మిట్టపెల్లి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా ఇంజపురి రాజేందర్, కోశాధికారిగా వెల్డి కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా దేవులపల్లి సదానందం, మామిడాల చంద్రమౌళి, కనుకుంట్ల ఆంజనేయులు, బూర కుమారస్వామి, వెంగళ బాలకృష్ణ, గౌరవ సలహాదారుగా పులికంటి రాజేందర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడారు. పద్మశాలి కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. కులస్తులకు అందుబాటులో ఉంటూ సేవాభావంతో పని చేస్తానని చెప్పారు. పద్మశాలీలు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఆ దిశగా తాను చొరవ తీసుకోనున్నట్టు వివరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దామెర : ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన దామెర పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం... మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామానికి చెందిన బండారి భీంరాజు (50)ను ఈనెల 18న రాత్రి బండారి భీంరాజు ఇంటికి వరదరాజులు, కోటి వెళ్లి దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన భీంరాజు 19న ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈ క్రమంలో భీంరాజు పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు బండారి వరదరాజు, కోటిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.